పత్తి రైతుల పరేషాన్!

- తెగుళ్ల బారిన తెల్ల బంగారం
- వేధిస్తున్న కూలీల కొరత
- కౌలు రైతులకు అధిక కష్టాలు
- ప్రారంభం కాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు

మర్రిగూడ : ఈ ఏడాది పత్తి రైతులకు కాలం కలిసి రావడం లేదు. పత్తి పంట సాగు మొదలుకుని పత్తి తీసి విక్రయించే వరకు అష్టకష్టాలు తప్పడం లేదు. చివరికి కనీస మద్దతు ధర లభించకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా ఈ ఏడాది 25,780 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా తెల్ల బంగారానికి ఎర్ర గుమ్మడి తెగులు సోకింది. ఆ తరువాత పగిలిన పత్తిని తీయాలంటే కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. తీసిన పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయిద్దామనుకుంటే సీసీఐ కేంద్రం ఏర్పాటు కాకపోవడంతో రూ.5వేల నుంచి రూ.5,500 మాత్రమే దళారులకు అమ్ముకోక తప్పని పరిస్థితి.

పెట్టుబడి రావడం కూడా కష్టతరమే..

సొంత భూమి కలిగిన రైతులు తమ పొలంపై పెట్టుబడులు పెడితే ఈ ఏడాది కాకపోయినా మరో ఏడాదిలో పంటల సాగు ఆశాజనకంగా ఉంటుందని ఆశతో ఉంటారు. కానీ అదే కౌలు రైతులు మాత్రం కౌలుతోపాటు పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేసి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.


తిరగండ్లపల్లిలో తెగులు సోకిన పత్తిపంట

ఎకరం పత్తిపంట సాగు చేయాలంటే రూ.20వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టినప్పటికీ ఆశించిన దిగుబడులు రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ ధరకు అమ్ముకుంటున్న రైతులు

రోహిణి కార్తెలో సాగు చేసిన పత్తి పంటను రైతులు దసరా పండుగ కంటే రెండు, మూడు వారాల ముందే పత్తి తీయడం మొదలుపెట్టారు. పత్తి తీసిన కూలీలకు వెంటనే కూలి డబ్బులు చెల్లించాలి. దానికితోడు పెట్టుబడులు పెట్టి ఉండడంతో తెచ్చిన అప్పులు చెల్లించాలి. అయితే సకాలంలో మండలంలో సీసీఐ కేంద్రం ప్రారంభించకపోవడంతో చేసేదేమి లేక గ్రామాల్లో చిరు వ్యాపారులు, దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే పత్తిని అమ్ముకుంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు సకాలంలో స్పందించి సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే మండలంలోని సరంపేట పత్తి కొనుగోలు కేంద్రంలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ వర్షాలు కురవడంతో పత్తి తేమశాతం అధికంగా వస్తున్న కారణంగా పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదు. ఈ కొనుగోలు కేంద్రం వద్ద పత్తిని రూ.5,500 నుంచి రూ.6 వేల వరకు ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

కూలీల కోసం తిప్పలు పడుతున్నాం



ఈ ఏడాది పత్తి పంట సాగు చేస్తే రైతులకు లాభం దేవుడెరుగు.. నష్టం మాత్రం అధికమైంది. సకాలంలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేస్తే కనీస మద్దతు ధర అయినా లభించేది. కురుస్తున్న వర్షాల కారణంగా పత్తిని ఆరబెట్టలేక కూలీల కోసం తిప్పలు పడుతున్నాం. ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి.

–నీలకంఠ రాములు, రైతు, యరగండ్లపల్లి

20 శాతం పైగా తేమ వస్తోంది

ప్రస్తుతం వర్షాల కారణంగా తేమశాతం 20కు పైగా వస్తోంది. పత్తిలో 8 శాతం తేమ వస్తే మద్దతు ధర రూ.7521 లభిస్తుంది. పత్తి తేమ శాతం అధికంగా ఉండడం వల్ల రైతులకు మద్దతు ధర రాకపోవచ్చు.

–వేణుకుమార్, మాల్ మార్కెట్ కమిటీ కార్యదర్శి

అభివృద్ధి చూసి తట్టుకోలేక తప్పుడు ప్రచారం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ మూసీ నది ప్రక్షాళన, అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఈ నెల 27న శాలిగౌరారం మండలం గురుజాల, అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామాల మధ్య మూసీనదిపై ఉన్న బ్రిడ్జి వద్ద నిర్వహించనున్న మూసీ పరీవాహక రైతుల ఆత్మీయ సమ్మేళన సభకు సంబంధించిన స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మూసీ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిపక్షాలు పాలకపక్షానికి సలహాలు, సూచనలు చేయాలే కానీ ప్రభుత్వంపై శాపనార్థాలు పెట్టవద్దన్నారు. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయ కుట్రను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్ర హెరిటేజ్‌గా మూసీనదిని తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుల ఆత్మీయ సమ్మేళన సభకు తుంగతుర్తి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శాలిగౌరారం, అడ్డగూడూరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందాల సమరంరెడ్డి, పోలెబోయిన లింగయ్య, ఆయా మండలాల నాయకులు నూక కిరణ్, సుధాకర్, అనిల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఇంతియాజ్, అంజయ్య, వెంకటయ్య, నిరంజన్‌రెడ్డి, చిరంజీవి, జోజి, సత్యనారాయణ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి కోటేశ్వర్‌రావు

కట్టంగూర్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి వి.కోటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఓపీ పెంచాలని, ఆరోగ్య ఉప కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని వైద్యాధికారి శ్వేతకు సూచించారు. అనంతరం కట్టంగూర్‌లో నిర్మించిన కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, ఏఈలు నవీన్, జమీల్, ఏపీఎం సైదులు, ఏపీఓ రాంమోహన్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి చరితారెడ్డి

శాలిగౌరారం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా కేంద్ర నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి చరితారెడ్డి అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడారు. కేంద్రంలో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి కేంద్ర నిర్వాహకులకు సహకరించాలన్నారు. ఆమెవెంట ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఎంపీఓ పద్మ, మార్కెట్ కార్యదర్శి చీనానాయక్, పీఏసీఎస్ సీఈఓ ఆంజనేయులు, ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ శంకర్, సిబ్బంది ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కట్టంగూర్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ నకిరేకల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. డి స్వామి, గోపిచంద్, సతీష్, లింగస్వామి పాల్గొన్నారు.

కార్యదర్శికి..

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతూ గ్రామ యువకులు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి నజీరాకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో కొండా కాటయ్య, ఐతగోని ఉపేందర్, కారింగు దేవేందర్, ఐతగోని లింగస్వామి, కొండా దేవేందర్, పాండు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల స్థాయికి దిగజారిన మాజీ ఎమ్మెల్యేలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నార్కట్‌పల్లి : బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కార్యకర్తల స్థాయికి దిగజారి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విమర్శిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు రామన్నపేట మండల పరిధిలో సిమెంటు కంపెనీ ఏర్పాటుకు 200 ఎకరాల భూమిని కంపెనీ వారికి ఇప్పించి, వారి వద్ద కమీషన్ తీసుకుని, రిజిస్ట్రేషన్ చేయించి, అనుమతులు ఇప్పించి ఇప్పుడు తమకు తెలియదని మాట్లాడుతున్నారని ఆరోపించారు. అనంతరం నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తదుపరి నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గాదరి కిశోర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జేరిపోతుల భారత్, మాజీ ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, మల్లేశం, యాదయ్య, రాంరెడ్డి, దార యాదయ్య, వడ్డేగోని నర్సింహ, కిట్టు, సత్తి, భిక్షపతి, రవి, స్వామి, సత్తయ్య, రాములు పాల్గొన్నారు.

కోమటిరెడ్డిని విమర్శించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి

తిప్పర్తి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విమర్శించే అర్హత బీఆర్‌ఎస్ నాయకులకు లేదని మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్ అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే నలగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తన విలువను కోల్పోయారని, ఇంకా దిగజారవద్దన్నారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ స్థాయిని మించి మాట్లాడడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, నాగులవంచ లింగారావు, ముత్తినేని శ్యాంసుందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం సుధీర్, పాశం నరేష్‌రెడ్డి, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, పల్లె ఎల్లయ్య, జాకటి మోష, అంజి, వెంకన్న పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శిగా మల్లేశం

చండూరు(గట్టుప్పల్) : సీపీఐ(ఎం) గట్టుప్పల్ మండల కార్యదర్శిగా కర్నాటి మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం గట్టుప్పల్‌లో జరిగిన మండల మహాసభలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

నల్లగొండ టౌన్: అధికార, ప్రతిపక్ష నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి సలీం అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఒకరిపైమరొకరు ఆరోపణలు చేసుకోవడం సరికాదన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, గాదె నరసింహ, అద్దంకి నర్సింహ, మారగోని నగేష్, కోట్ల అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

తల్లిని పట్టించుకోని కుమారులకు కౌన్సిలింగ్


లక్ష్మమ్మ, ఆమె కొడుకులతో పీడీ కృష్ణవేణి

నల్లగొండ: జిల్లాలోని దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన తాడోజు లక్ష్మమ్మను కుమారులు పట్టించుకోవడం లేదు. కలెక్టర్ దృష్టికి ఈ విషయం తెలియడంతో వెంటనే విచారణ చేయాలని శిశు సంక్షేమ శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. దీంతో మహిళాశిశు సంక్షేమ, వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ పీడీ కృష్ణవేణి శుక్రవారం బాధితురాలు లక్ష్మమ్మ.. కుమారులు నర్సింహాచారి, వినోదాచారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. తల్లిదండ్రుల పోషణ చట్టం 2007 ప్రకారం వయో వృద్ధురాలిని పట్టించుకోకపోయినా, కొట్టినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో తమ తల్లిని బాగా చూసుకుంటామని చెప్పి తీసుకెళ్లారు. అధికారులు వారితో రాతపూర్వకంగా తీసుకుని కుమారులకు ఆమెను అప్పగించారు. ఆ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ నాగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, సునిల్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ క్లబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


క్రికెట్ ఆడుతున్న చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: యువకులు స్పోర్ట్స్ క్లబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక సాయి నగర్‌లో ఏర్పాటు చేసిన ఎంఐ స్పోర్ట్స్ క్లబ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, స్నూకర్ క్రీడలను ఒకేచోట స్పోర్ట్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసి కోచ్‌లను నియమించి శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కౌన్సిలర్లు మాతంగి సత్యనారాయణ, సమీ, మారగోని భవాని గణేశ్, ఫసహాద్ అలీబాబా, నాయకులు ఇబ్రహీం, అమీర్, నిర్వాహకులు ముజాఫర్, ఇసాక్, అంజాద్ ఖాన్, జలీల్, హఫీజ్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిర్మూలించాలని ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నాంపల్లి : అక్రమంగా నడుస్తున్న మద్యం షాపులు, గంజాయి, మత్తు పదార్థాలను గ్రామాల్లో నిర్మూలించాలని కోరుతూ శుక్రవారం నాంపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు దేవ్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మహిళలు నడుం బిగించి బెల్ట్ దుకాణాలను మూసివేయించేలా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, పెద్దిరెడ్డి రాజు, గజ్జల శివారెడ్డి, పానగంటి వెంకటయ్య, విష్ణుమూర్తి, ఎండీ ఖాదర్, కొరే యాదయ్య, కిషన్, చందు, చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, మహిళలు అరుణ, యాదమ్మ, వీబీకేలు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపికైన రాజ్



కేతేపల్లి: మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, ప్రాణదాత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మేరుగుమళ్ల రాజ్.. సర్దార్ వల్లాభాయ్ పటేల్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. రాజ్ నాలుగేళ్లుగా ఫౌండేషన్ తరఫున దాదాపు 3000 మందికి రక్తదానం చేయడంతోపాటు ఫౌండేషన్ సభ్యులు, మిత్రుల సహకారంతో విరాళాల సేకరించి ఆపదలో ఉన్న పేదలకు ఆర్థిక చేయూత నందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాను చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా సూర్యాపేటకు చెందిన హోప్ స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దైద వెంకన్న ఈ పురస్కారానికి తనను ఎంపిక చేశారని రాజ్ తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాజ గాన సభలో నిర్వహించనున్న కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

రామగిరి (నల్లగొండ): రెడ్ రిబ్బన్ యూత్ ఫెస్ట్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలన అంశంపై శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో నల్లగొండలోని దేవరకొండ రోడ్డు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అవినాష్, కె.విశాల్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి, మెమోంటో, ప్రశంసాపత్రాలతో పాటు రూ.8 వేల నగదు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని డీఈఓ భిక్షపతి, ప్రధానోపాధ్యాయుడు యూసుపుద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

టాలెంట్ టెస్టులో..

నల్లగొండ టూటౌన్: శ్రీనివాస రామానుజన్ టాలెంట్ టెస్టులో నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల సాందీప్ స్కూల్‌కు చెందిన 16 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి లెవెల్ 2కు ఎంపికయ్యారని శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ గానూతుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్, విద్యార్థులు అభినందించారు.


విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు

నేటి నుంచి దేవతామూర్తుల కల్యాణం

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ సత్యసాయి మందిరంలో లోక కల్యాణార్థం శనివారం నుంచి 28వ తేదీ వరకు మూడు రోజులపాటు దేవతామూర్తుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా శ్రీసీతారామ కల్యాణం, సువర్చలా హనుమత్కల్యాణం, శ్రీ శివపార్వతుల కల్యాణ మహోత్సవం జరుగనున్నాయి.

కేతేపల్లి వాసి డాక్టరేట్


దండు హరీష్

కేతేపల్లి: మండల కేంద్రానికి చెందిన దండు హరీష్ ఇఫ్లూ (ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్) సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. దండు ఎల్లయ్య–వెంకటమ్మ దంపతుల చిన్న కుమారుడు హరీష్ ఇఫ్లూ ప్రొఫెసర్ ఎస్.నాగేశ్వరావు పర్యవేక్షణలో పాఠశాల విద్య విభాగంలో ×ఎఫెక్టివ్‌నెస్ ఆఫ్ సీఎల్ఐఎల్ టు డెవలప్ వెర్బల్ క్రియేటివిటి ఎమాంగ్ సైత్ క్లాస్ స్టూడెంట్స్‌ ˚అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించిన పత్రాలకుగాను డాక్టరేట్ పట్టా పొందారు. హరీష్ ఎంఏ ఇంగ్లిష్‌తోపాటు ఎంఈడీ పూర్తి చేశారు. హరీష్ ప్రస్తుతం మెదక్‌లోని ఓప్రైవేటు డీఈడీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. హరీష్ డాక్టరేట్ పట్టా పొందడంపై తల్లిదండ్రులు, సోదరులు వెంకటేష్, నరేష్ అభినందించారు.

దాడులను అరికట్టాలి

చిట్యాల: దేశంలో ప్రజాస్వామ్య వాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నేరడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం మహాసభలో ఆయన మాట్లాడారు. పిల్లలమర్రి లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మండల రూరల్ కార్యదర్శి అర్రూరి శ్రీను, కల్లూరి కుమారస్వామి, ఎల్లయ్య, కందగట్ల గణేశ్, సంకోజు నర్సింహాచారి, భిక్షం, యాదయ్య, మహేష్ పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన గెజిటెడ్ అధికారులు


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గెజిటెడ్ అధికారులు

నల్లగొండ: గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి బొకే అందజేశారు. ఇటీవల తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా వారు మంత్రిని కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎండీ.ముజీయుద్దీన్, ఎం.శ్రీనివాసులు, బి.అమరేందర్‌గౌడ్, ఎండీ.ఇస్లాం అలీ, జి.వెంకటేశ్వర్లు, ఎం.చరిత, జె.బాలరాజరెడ్డి, ఎండీ.అక్తర్ పర్వేజ్, ప్రసన్నకుమార్, ఆర్.కనకదుర్గ, కె.సందీప్‌రెడ్డి, ఎండీ.మహ్మద్ అలీ, ఎండీ.హనీఫ్, ఎండీ.జకీర్ అలీ, జె.ఖాసీం, ఎస్.రాజారాం, వి.శివకుమార్, రవీందర్, బి.ప్రసాద్, ఎస్.శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చండూరులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఆందోళన

చండూరు : ప్రభుత్వం నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలను చండూరు మండలంలో నిర్మించాలని సామాజిక ఉద్యమ నేత మహేష్ శుక్రవారం చండూరు చౌరస్తాలో ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనకు బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. తాను చండూరు మండలంలో కావాల్సిన అభివృద్ధి పనులపై మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొంతమంది తొలగించారని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అనంతరం నిరసన చేస్తున్న మహేష్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

హామీలను అమలు చేయాలి

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి చిట్యాల నుంచి శుక్రవారం వెళ్తున్న మున్సిపల్ కార్మికుల వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్ష్మయ్య, అండాలు, నర్సింహ, నరేష్, యమున, రమణ, అలివేలు, దుర్గేష్, కళమ్మ, సైదులు, లింగస్వామి, శంకర్, చాముండేశ్వరి పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ మండలం కాకుల కొండారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కుడతల నర్సింహ ఇటీవల మృతి చెందాడు. కాగా ఆయనకు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం నర్సింహ భార్య చంద్రకళకు అందజేశారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నల్లగొండ రూరల్: అన్నెపర్తి, గుండ్లపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నంరాజు శుక్రవారం ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, వైస్ చైర్మన్ తవిటి కృష్ణయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు దేప వెంకట్‌రెడ్డి, హాశం, అంజయ్య, వెంకట్‌రెడ్డి, జ్యోతి, నర్సిరెడ్డి, సైదులు, సీఈఓ అనంతరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ

నల్లగొండ : పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా పొట్టబత్తుల సత్యనారాయణ ఎన్నికయ్యారు. శుక్రవారం నల్లగొండలో జరిగిన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపోలు దత్తగణేష్, ప్రధాన కార్యదర్శి కర్నాటి యాదగిరి, కార్యదర్శి రాపోలు సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు రాపోలు శరబయ్య, మిర్యాల వెంకటేశం, పట్టణాధ్యక్షుడు మిర్యాల స్వామి, యూత్ అధ్యక్షుడు పెండెం ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలంలోని మర్రిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం భక్తాంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు సిరిప్రగడ శ్రీనివాసశర్మ, రుద్రాక్షి నరసింహ, వెలుగు శంకర్, రాములు, నగేష్ పాల్గొన్నారు.

బహిరంగ వేలం

కనగల్ : మండలంలోని దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద పూలు, పండ్ల విక్రయాలకు శుక్రవారం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. జనగామ జిల్లా పాలకుర్తికి చెందిన జెట్టి కుమార్ అనే వ్యాపారి రూ.13 లక్షల 6 వేలకు వేలం పాట పాడి హక్కులను పొందారు. గత ఏడాదితో పోల్చితే ఆలయానికి ఈవేలం పాటతో రూ.2 లక్షల 61 వేల ఆదాయం పెరిగిందని ఆలయ అధికారులు సుమతి, జల్లేపల్లి జయరామయ్య తెలిపారు. కొబ్బరికాయలు, లడ్డు, పులిహోర, గాజులు, కిరాణం, మిఠాయిలు, ఫొటోలకు వేలం పాట వాయిదా పడిందని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

మర్రిగూడ : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నాగవరం శ్రీనివాస్‌రావు మండలంలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని మళ్లీ గెలిపించాలని కోరారు.

వ్యాసరచన పోటీలు

నల్లగొండ క్రైం: పోలీస్ అమరులవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాలలో టూటౌన్ పోలీసులు డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్.ఐ నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సైదిరెడ్డి, అధ్యాపకులు భవాని, యామిని, మానస, స్వాతి , సురేష్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

నకిరేకల్ : చందుపట్ల గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారంనిర్వ హించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ నకిరేకంటి మొగిలయ్య, సాయన్న, మండల వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, కొండే టి శ్రీను, నాగరాజు, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ సభ్యత్వ ప్రబారి కడియం రామచంద్రు నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నకిరేకంటి మొగులయ్య, కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు దండ శ్రీని వాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, మండల అధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నల్లగొండ క్రైం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ రాజు అన్నారు. పట్టణంలో రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన వాహనాలను శుక్రవారం స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో రోడ్లపై నిలిపిన వాహనాలను ప్రత్యేక వాహనంలో స్టేషన్‌కు తరలించి వాహనదారులకు రూ. 500 చొప్పున జరిమానా విధించామన్నారు.

జర్నలిస్టు కిరణ్‌కుమార్‌పై దాడి

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణంలో జర్నలిస్టు కిరణ్ కుమార్‌పై శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారు. తన నివాసం వద్ద కొందరు వ్యక్తులు తనపై దాడిచేసి కొట్టారని కిరణ్‌కుమార్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కేతేపల్లి: మండలకేంద్రానికి చెందిన పసల జయరాజు(27) గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం జయరాజు మృతదేహాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ నాయకుడు దైద రవీందర్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం ముదిరెడ్డి వీరారెడ్డి దశదిన ఖర్మలో వారు పాల్గొని వీరారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

రేపు సంస్మరణ సభ

రామగిరి (నల్లగొండ): నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు కరపత్రం ఆవిష్కరించారు. సీహెచ్.సుధాకర్‌రెడ్డి, రామయ్య, అనంతరెడ్డి, శేఖర్, యాదగిరిరెడ్డి, లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు.